ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -156 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 15 జులై 2026

# అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి..

## ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు





**క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం**

**ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు**

**అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు**

**2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు**



**అమరావతి,జూలై 14, ఆంధ్ర ప్రగతి** ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు **మిగతా 2లో...**

కాపు ఉద్యమ నేత

# ముద్రగడ కన్నుమూత

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**



**హైదరాబాద్ జూలై 14, ఆంధ్ర ప్రగతి**

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌలిలోని **మిగతా 2లో...**

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..




**గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం**

**రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల**

**ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి**

**అమరావతి,జూలై 14,ఆంధ్ర ప్రగతి**

ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును**మిగతా 2లో...**

# ట్రంప్ యూటర్న్

**:హర్మూజ్ పై 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!**

**ఢిల్లీ జూలై 14,ఆంధ్ర ప్రగతి**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు **మిగతా 2లో...**

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**

KHELO INDIA YOUTH GAMES

**హైదరాబాద్,జూలై 14, ఆంధ్ర ప్రగతి**

8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ **మిగతా 2లో...**

# నెలవారీ ఆర్థిక నివేదిక

## దేశంలోనే తొలిసారిగా

**డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వం వినూత్న ప్రయత్నం**

**వివిధ రంగాల ప్రగతిని రియల్ టైమ్‌లో పర్యవేక్షించేందుకు కొత్త విధానం**

**స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధనకు ఇది దోహదపడుతుందన్న పయ్యావుల**



**అమరావతి,జూలై 14, ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ పాలనలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నామని, డేటా ఆధారిత పాలన (డేటా డ్రివెన్ గవర్నెన్స్) దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్) ఆధారంగా ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు.**మిగతా 2లో...**

# టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో కీలక మార్పులు

**సామాన్య భక్తుల కోసం తిరుమలలో రూ.6.31 కోట్లతో శాశ్వత షెడ్ల నిర్మాణం**

**ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో 100 గదుల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం**

**వేద పారాయణ స్కీం కింద 791 మంది వేద పండితులను నియమించాలని నిర్ణయం**

**ఎస్వీ మ్యూజియం ప్రవేశ రుసుము రూ.50గా ఖరారు, నిర్వహణపై టాటాతో చర్చలు**

**తిరుమలజూలై 14, ఆంధ్ర ప్రగతి**



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ పరిధిలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇచ్చే దాతలకు కల్పించే ప్రత్యేక సౌకర్యాలు (ప్రివిలేజెస్)లో మార్పులు చేస్తున్నట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ కొత్త **మిగతా 2లో...**

# అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను నిర్మించండి

**ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి**

**కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ ఎయిర్‌పోర్టు**

**ఆదిలాబాద్ భూసేకరణా చేపడతాం : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్‌జూలై 14, ఆంధ్ర ప్రగతి**




తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఈ రెండు విమానాశ్రయాలకు ఉన్న సానుకూల అవకాశాలు, పరిస్థితులను సీఎం వివరించారు. మంగళవారం ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో రాజీవ్ గాంధీ భవన్‌లో **మిగతా 2లో...**

# ఏసీబీ వలలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారి..

**హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్‌పై ఏసీబీ కేసు**

**అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు**

**రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు**



**హైదరాబాద్ జూలై 14,ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు,**మిగతా 2లో...**

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ





**ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన**

**బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్**

**ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది**

**మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ**

**సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత**

**విశాఖపట్నం,జూలై 14, ఆంధ్ర ప్రగతి**

విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార **మిగతా 2లో...**

# అధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లాలి..

**మొదటిపేజీ తరువాయి**

అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్‌ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..

**మొదటిపేజీ తరువాయి**

పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**గడువు పెంపునకు దారితీసిన కారణాలు**

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.

**సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు.
అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సవరించిన షెడ్యూల్ వివరాలు**

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:
ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24
ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31
అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు
అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28
ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3
ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ

**మొదటిపేజీ తరువాయి**

కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్ణవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లుమన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రో÷–డడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన**

మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దీని గురించి వివరాలు తెలిపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున అందిస్తామని కేకే రాజు చెప్పారు. ఈ డబ్బును వైఎస్సార్‌సీపీ తరఫున అందిస్తామని అన్నారు. ప్రాణాలతో బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని వివరించారు. చిన్నా కుటుంబానికి రూ.7 లక్షల సాయం చేస్తామని చెప్పారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో

# విమానాశ్రయాలను నిర్మించండి

**మొదటిపేజీ తరువాయి**

రామ్మోహన్ నాయుడుతో సీఎం.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంతోపాటు నల్లగొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని అన్నారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసిన కారణంగా వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని రామ్మోహన్ నాయుడును సీఎం కోరారు. రెండు ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూమిని సేకరిస్తామని సీఎం చెప్పారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలను నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రెటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ కార్యదర్శి మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మెన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెలవారీ ఆర్థిక నివేదిక

**మొదటిపేజీ తరువాయి**

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు.ఈ సరికొత్త విధానం ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ) బెస్ట్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామని పయ్యావుల వివరించారు. దీనివల్ల రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నమోదయ్యే వృద్ధి రేటును, ప్రగతిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో గమనించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విధానం వల్ల ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి, మనల్ని మనం సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు ఆస్కారం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సాకారం చేసుకునేందుకు ఈ నెలవారీ ఆర్థిక నివేదికలు ఎంతగానో ఉపకరిస్తాయని మంత్రి పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# కాపు ఉద్యమ నేత ముద్రగడ కన్నుమూత

**మొదటిపేజీ తరువాయి**

ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరపున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు. 1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన.. ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

# టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో కీలక మార్పులు

**మొదటిపేజీ తరువాయి**

నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఆయన ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరూపత తీసుకురావడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అయితే, ఇప్పటికే విరాళాలు సమర్పించిన పాత దాతలకు ప్రస్తుతం అమల్లో ఉన్న సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయని ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ధర్మప్రచారం వంటి అంశాలపై అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**సమావేశంలో తీసుకున్న మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలు**

భక్తుల కోసం శాశ్వత షెల్టర్లు: తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల సౌకర్యార్థం, సర్వదర్శనం (ఽఽణ) టోకెన్లు పొందిన వారు వేచి ఉండేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం రూ.6.31 కోట్ల వ్యయంతో ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపింది.డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు: తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఈ డ్యామ్‌ల వద్ద డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరు చేస్తూ బోర్డు ఆమోదముద్ర వేసింది.హరిత ఇంధన ప్రోత్సాహం: తిరుమలలో హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక అడుగు వేశారు. జీఎన్‌సీ సమీపంలో 800 కిలోవాట్ల సామర్థ్యం గల విండ్ టర్బైన్ జనరేటర్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ దీన్ని విరాళంగా ఏర్పాటు చేసి, 25 సంవత్సరాల పాటు టీటీడీకి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనుంది.అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణ: భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ.2.35 కోట్లతో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు.

# ట్రంప్ యూటర్న్

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం.మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మ్యూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి.
మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

# ఏసీబీ వలలో హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి..

**మొదటిపేజీ తరువాయి**

రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు.
ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ+4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీ-ఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.
వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

# కర్నూలులో రోడ్డు ప్రమాదం.. ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం.

**జాగింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ ఫ్లైఓవర్‌పై నుంచి పడి మృతి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 14:** కర్నూలు నగరంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై జాగింగ్ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు అదుపుతప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడిన వరప్రసాద్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం దర్యాప్తు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి మృతితో ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ షెడ్యూల్ సవరణ.

**సవరించిన షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి.**

**ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 14:**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 01.07.2026 అర్హత తేదీతో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్ సంబంధిత అధికారులకు సవరించిన కార్యాచరణ షెడ్యూల్‌ను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వే కార్యక్రమం 2026




జూన్ 15 నుండి జూలై 24 వరకు కొనసాగనుందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను జూలై 24 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించబడతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలను విచారించి పరిష్కరించే ప్రక్రియ చేపట్టి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని కలెక్టర్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్‌ను సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బంది తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రజలకు ఈ షెడ్యూల్‌పై పూర్తి అవగాహన కల్పించేందుకు అందుబాటులో ఉన్న అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సవరించిన షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా తెలియజేసి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు.

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 14:**
జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను ఈరోజు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ నమోదు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎస్‌డీడీ జాబితాకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ధృవీకరించి మాత్రమే చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు లకు స్పష్టం చేశారు. కర్నూలు (99.39 శాతం), పాణ్యం (97.22 శాతం) నియోజకవర్గాల పెండింగ్ పనులను మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలన్నారు. అదే విధంగా ఎమ్మిగనూరు (99.55 శాతం), మంత్రాలయం




(99.37 శాతం), ఆదోని (99.47 శాతం), ఆలూరు (99.97 శాతం) నియోజకవర్గాల అధికారులు కూడా పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పత్తికొండ, కోడుమూరు మినహా మిగతా అన్ని నియోజకవర్గాలు నిర్ణీత గడువులో పూర్తిస్థాయికి చేరుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌ను కూడా తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్ లో వచ్చిన ఎన్యూమరేషన్ ఫార్మ్ ప్రస్తుతం పాణ్యంలో 48, కర్నూలులో 13, ఎమ్మిగనూరులో 6, ఆదోనిలో 4, కోడుమూరు మరియు మంత్రాలయంలో ఒక్కో ఫారం చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, ఇవన్నీ మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ రిక్వెస్ట్ లు 184 ఉంటే, 48 గంటల కంటే ఎక్కువ సమయం నుండి పెండింగ్ లో ఉన్న రిక్వెస్ట్ 26 ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బి ఎల్ ఎ మినిట్స్ ను 2203 బి ఎల్ ఓ లలో కేవలం 241 మంది బి ఎల్ ఓ లు మాత్రమే ఆన్లైన్ లో అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన బి ఎల్ వో లు కూడా వెంటనే అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి చేసిన తనిఖీలకు ఆధారంగా, పొరుగువారి సంతకాలతో కూడిన పంచనామా ప్రొఫార్మాలను సిద్ధం చేసి భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. దీంతో బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితా ప్రచురించిన అనంతరం, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు ఉండటం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్దేశిత విధానంలో సమర్పించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఈఆర్‌ఓ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

# కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్.

**..జానాలగూడెం చెంచు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన జిల్లా ఎస్పీ.**

**..ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి.**

**..ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత.**



**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు జూలై 14:**
నంద్యాల జిల్లా ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి సునీల్ షొరాణ్, మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు,



స్టేషన్ రికార్డులు, కేసు నమోదు తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితి, గ్రామాల్లో పోలీసింగ్ విధానం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తదుపరి జానాలగూడెం చెంచు గ్రామాన్ని స్వయంగా సందర్శించిన జిల్లా ఎస్పీ గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఐకమత్య వాతావరణాన్ని కొనసాగిస్తూ ఎలాంటి గొడవలు, వివాదాలకు తావు ఇవ్వకుండా పరస్పర సహకారంతో జీవించాలని సూచించారు. అలాగే పిల్లలకు విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రతి కుటుంబం కృషి చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ యొక్క అత్యున్నత ప్రాధాన్యత. ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది" అని తెలిపారు.

# రైతులు పంటల భీమా చేయించుకోవాలి: ఏవో




**ఆంధ్ర ప్రగతి మహానంది జూలై 14:**
గ్రామాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటల భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వర్ రెడ్డి సూచించారు. మంగళవారం మహానంది మండలంలోని బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన వివిధ పంటలకు రైతు సేవ కేంద్రాల్లో నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ లో పంట బీమా చేయించుకోవాలని, వరి పంటకు ఎకరాకు రూ.800, మొక్కజొన్నకు రూ.660, మినుము పంటకు రూ.190 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వరి పంటకు ప్రీమియం చెల్లించడానికి ఆఖరి తేదీ ఆగస్టు 15 అని, మొక్కజొన్న , మినుము పంటలకు జూలై 31వ తేదీగా ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందని, పంట బీమా కొరకు ఫార్మర్ ఐడి తప్పనిసరి అన్నారు. ఉద్యాన శాఖ అధికారి హరేంద్ర మాట్లాడుతూ.. రైతులు అరటి పంటకు జూలై 31వ తేదీ లోపు ఎకరాకు రూ.2,750 చెల్లించి ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. అరటి పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు , గ్రామ వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, భవ్య శ్రీ, రైతులు పాల్గొన్నారు.

# ప్రజల సానుకూల దృక్పథం 80% కు రావాలి

**..గ్యాస్ బాయ్స్ అదనపు డబ్బులు తీసుకుంటే ఏజెన్సీ పై కఠిన చర్యలు.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**..ఏజెన్సీలు గ్యాస్ బాయ్స్ కి బ్యాంకు,డిజిటల్ పేమెంట్ ల ద్వారా జీతాలు చెల్లించాలి.**

**..ఇకపై ఎటువంటి పొరపాట్లు జరిగిన ఉపేక్షించేది లేదు.**

**..జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**

**ఆంధ్ర ప్రగతి కర్నూలు జూలై 14:**
గ్యాస్ ఏజెన్సీలు ప్రజల సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) లో మంచి గుర్తింపు సాధించి జిల్లా ను మంచి స్థానం లో ఉండేలాగా చర్యలు తీసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి. పేర్కొన్నారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ప్రజల కు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తూ ఉన్నప్పటికీ ప్రజల నుండి సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) రాకపోవటానికి కారణం గ్యాస్ ఏజెన్సీలు మరియు డెలివరీ బాయ్స్ కారణమని తెలిపారు. ఇప్పటికే చాలాసార్లు ఈ విషయంపై సూచనలు ఇవ్వడం , శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. డెలివరీ బాయ్స్ అదనపు సొమ్ము వసూలుకు పాల్పడం వలన ప్రజల సానుకూల దృక్పథం సూచిక లో వెనుకబడి ఉన్నామని ఈ విషయంలో ఏజెన్సీలు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐఓసీ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ) సంస్థ ఇప్పటికే మూడు ఏజెన్సీ లపై చర్యలు తీసుకున్నదని తెలిపారు. కొన్ని ఏజెన్సీలపై 2 లక్షల రూపాయల నుండి 8



లక్షల రూపాయల వరకు పెనాల్టీలు కూడా విధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పెద్ద కడుబూరు చెందిన మాధురి గ్యాస్ ఏజెన్సీ కి ఎన్నిసార్లు హెచ్చరించిన సరైన చర్యలు తీసుకొననందున ఆ ఏజెన్సీ పై చర్యల లో భాగంగా వారి కస్టమర్లను సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి ట్యాగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గ్యాస్ ఏజెన్సీలు చిత్తశుద్ధితో ప్రజలకు గ్యాస్ సరఫరా చేసి ప్రజా సానుకూలత పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... గ్యాస్ డెలివరీ బాయ్స్ లు ప్రజల కు సిలిండర్ ఇచ్చాక అదనపు మొత్తం తీసుకొనరాదు. ఏజెన్సీ లు డెలివరీ బాయ్స్ కు జీతం బ్యాంక్ లేదా డిజిటల్ పేమెంట్స్ ద్వారా మాత్రమే చెల్లించాలి, ఈ విధంగా చేయక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ లు శివ బాలాజీ సి-బెలగల్ , మాధురి గ్యాస్ ఏజెన్సీ పెద్దకడబూరు , విజయ గ్యాస్ కర్నూల్ , సూర్య గ్యాస్ ఏజెన్సీ , విష్ణుప్రియ మొదలగు గ్యాస్ ఏజెన్సీలను సమీక్షిస్తూ ఎంతమంది గ్యాస్ బాయిస్ ఉన్నారు , ఎన్ని వాహనాలు ఉన్నాయి వారికి జీతం ఏ విధంగా ఇస్తున్నారు , ఎంతమందిని కంప్లైంట్స్ పై తీసివేశారు ,అన్న విషయాలను అడిగి తెలుసుకుని ఎటువంటి పరిస్థితుల్లోనూ గ్యాస్ బాయ్స్ అదనపు సొమ్ము వసూలు చేయరాదని మరియు గ్యాస్ బాయ్స్ కు జీతం ఆన్లైన్ ద్వారానే చెల్లించాలని ఆదేశించారు. గ్యాస్ బాయ్స్ కు అందజేసే జీతాల వివరాలు మరియు సరఫరా కు వినియోగించే వాహనాల వివరాలు డిఎస్ఓ కార్యాలయానికి అందజేయాలని ఏజెన్సీ లను ఆదేశించారు. ఇకపై గ్యాస్ ఏజెన్సీలు ఎటువంటి పొరపాట్లు చేసిన ఉపేక్షించేది లేదని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ల పనితీరును సమీక్షించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లి ఈ విషయాల పై తనిఖీలు జరిపి నివేదికలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పౌర సరఫరా అధికారి రాజా రఘువీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని 41 ఏజెన్సీల పనితీరును , ప్రజా సానుకూలత దృక్పథం వివరాలు సమావేశంలో వివరించారు. ఈ సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజా రఘు వీర్ , ఏడి మార్కెటింగ్ నారాయణ మూర్తి , సివిల్ సప్లై డిప్యూటీ తాహసీల్దారులు , గ్యాస్ కంపెనీ ల ప్రతినిధులు మరియు జిల్లా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# డీసీసీ-డీఎల్ఆర్సీ సమావేశంలో రుణాల పురోగతిపై సమీక్ష

## ..విద్యా, గృహ రుణాలు, ఎఫ్‌పీఓ ఫైనాన్సింగ్‌పై ప్రత్యేక దృష్టి అవసరం.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జులై 14:**
మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశంలో జిల్లాలో బ్యాంకుల రుణాల పంపిణీ, వార్షిక రుణ ప్రణాళిక అమలు, వివిధ ప్రభుత్వ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. సమావేశంలో వ్యవసాయ, ఇతర రంగాల్లో 136.32 శాతం రుణాల సాధన నమోదైనా, పునరుత్పాదక ఇంధన రంగంలో 527 శాతం సాధన వల్లే మొత్తం పురోగతి పెరిగిందని పేర్కొన్నారు. ఈ రంగంలో రూ.9.37 కోట్ల లక్ష్యానికి గాను రూ.49 కోట్ల మేర రుణాలు మంజూరైనట్లు వివరించారు. విద్యా రుణాలు, గృహ నిర్మాణ రుణాల పంపిణీ ఆశించిన స్థాయిలో లేదని, కొత్త రుణ ఖాతాల పెంపుపై బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్, కిసాన్ క్రెడిట్ కార్డు సాచురేషన్ అంశాలపై సమీక్షిస్తూ, గుర్తించిన అవకాశాలు, లక్ష్యాలు, వాస్తవ అవసరాల మధ్య సమన్వయం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి సంవత్సరం రూపొందించే యూనిట్ కాస్ట్ బుక్‌లెట్‌లో కొత్త మౌలిక సదుపాయాలు, వినూత్న వ్యాపార నమూనాలను చేర్చేందుకు సంబంధిత శాఖలు ప్రతిపాదనలు అందించాలని, అలాగే కొత్త పంటల విధానాలకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రూపొందించి ఫైనాన్సింగ్‌కు కొత్త అవకాశాలు కల్పించాలని చర్చించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు బ్యాంకు రుణాల అనుసంధానం ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ఎఫ్‌పీఓలకు తగిన ఆర్థిక సహకారం అందించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అలాగే, విద్యా రుణాల లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కొత్త రుణ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ అనిల్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రామకృష్ణారెడ్డి, నాబార్డ్ డీడీఎం కార్తీక్, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంక్షేమ సంస్థలు, వ్యవసాయ అనుబంధ శాఖలు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు నగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా

# యాసిడ్ విక్రయాలు..?

**వేల లీటర్ల యాసిడ్ ఎక్కడికి పోతోంది.?**
**ట్రేడ్ లైసెన్స్, సేల్స్ ట్యాక్స్ కట్టకుండానే విక్రయాలా**
**బోర్డు నిల్... బిల్లు నిల్**
**లక్షల్లో "0"వ్యాపారం..**
**చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 14:**
దేశంలో ఎవరైనా వ్యాపారం చేయాలంటే ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తారు. అనుమతులు లేకపోతే అధికారులు చర్యలు చేపడతారు. అయితే, నంద్యాల మండలం లోని రైతు నగర్‌లో ప్రాణాంతకమైన వివిధ రకాల యాసిడ్ విక్రయాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్షల లీటర్లలో సాగుతున్నా ప్రజలు అంటున్న అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇటీవల ఎన్నో ప్రాంతాల్లో యాసిడ్ దాడులు జరిగిన సంఘటనలు చూస్తున్నాము. అయినప్పటికీ, రైతు నగర్‌లో యాసిడ్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

వాస్తవానికి యాసిడ్‌ను మరుగుదొడ్లు క్లీన్ చేయడానికి, విత్తనశుద్ధికి ఉపయోగిస్తారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల మండలం రైతు నగర్‌లో ఇతర ప్రాంతం నుంచి వచ్చిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా యాసిడ్ విక్రయాలు సాగిస్తున్నారు. నిత్యం వేల లీటర్ల యాసిడ్ విక్రయాలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నిత్యం నంద్యాలకు యాసిడ్ వస్తుంటుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు నంద్యాల నుంచే యాసిడ్ సరఫరా అవుతోంది.

సీజన్‌లో పత్తి విత్తన కేంద్రాల వారు యాసిడ్‌ను కొనుగోలు చేస్తారు. వారిలో కొందరు విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు, విత్తనాలను కడిగిన తర్వాత మిగిలిన యాసిడ్‌ను కుందూ, తెలుగుగంగ, కేసీ కెనాల్ కాలువల్లో కలుపుతున్నా.. ఇటీవలనే కుందులో వేల చేపలు కూడా చనిపోవడం జరిగింది. మామూళ్ల మత్తులో ఉన్న అధికారుల చర్యలు శూన్యం. యాసిడ్ అనేది నిత్యం వాడే వస్తువు కాకపోవడం, పైగా అది ప్రమాదకర రసాయనం అని అందరికీ తెలిసిందే. కాసింత చేతుల మీద పడితేనే బొబ్బలు వస్తాయి. అలాంటి యాసిడ్‌ను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు యాసిడ్ విక్రయించాలంటే మొదట ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. దీనితో పాటు పలు శాఖల అనుమతి తప్పనిసరి. ప్రధానంగా ఇది ప్రమాదకరం కాబట్టి పోలీస్, ఫైర్ శాఖల అనుమతులు ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కానీ, ఈ యాసిడ్ ఎక్కడినుంచి వస్తోంది? బిల్లుతో వస్తుందా లేదా? ఎవరెవరికి విక్రయిస్తున్నారు? అనే వివరాలు ఎక్కడా కనిపించడం లేదు. లక్షల్లో వ్యాపారం జరుగుతున్నా, కనీసం సేల్స్ ట్యాక్స్ కట్టకుండా ప్రభుత్వానికి చిల్లిగవ్వ ఇవ్వకుండా అక్రమ దందా సాగిస్తున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.

వేల లీటర్ల ప్రమాదకర యాసిడ్ విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగించడం వల్ల, జరగరాని ఘోరం ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరు? ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీలో రాణించాలి.


**బిసి రాజారెడ్డి**
**బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక**
**కరాటే విద్యార్థులను అభినందించిన బిసి రాజారెడ్డి**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూలై 14:**
జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బనగానపల్లె విద్యార్థులు రాణించాలని పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి అన్నారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలోని శ్రీ గాంధం శ్రీధరకృష్ణారెడ్డి భవన్, బాట్రిపేటలో నిర్వహించిన 6వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ & కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (KAI) నేషనల్ సెలెక్షన్స్2026 పోటీలు నిర్వహించారు. పోటీలలో బనగానపల్లెకు చెందిన జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను బిసి రాజారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుండి వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో రాణించిన వారిని, ఆగస్టు 7, 8, 9 తేదీలలో పశ్చిమ బెంగాల్‌లో జరిగే జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్2026కు ఆంధ్రప్రదేశ్ జట్టును ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. అందులో బనగానపల్లెకు చెందిన జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు 12 మంది వ్యక్తిగత విభాగాల్లో మరియు ఒక జూనియర్ టీమ్ కటా విభాగంలో జాతీయ స్థాయికి అర్హత సాధించడం గర్వించదగ్గ విషయం అన్నారు. కుమిటే విభాగంలో
ఎన్. నిహార,ఏ. శ్రీతేజ, డి. శ్రీదిత్య, ఎం. హేమలత, ఏ. నాగసాత్విక్ శర్మ, టి. కృష్ణమోహన్, డి. యశ్వంత్,టి. తారక, ఎన్. సాయిరితేష్ , ఈ. నాగ తారక రామ్ గౌడ్ , కె. సాయిచరణ్ తేజ విజేతలుగా నిలిచి స్వర్ణ పతకాలు సాధించడం అభినందనీయం అన్నారు. అలాగే కటా విభాగంలో కె. సాయిచరణ్ తేజ కాంస్య పతకం, టీమ్ కటా విభాగంలో కె. సాయిచరణ్ తేజ, ఈ. నాగతారకం గౌడ్, పి.వి. మహీధర్, ఎన్. సాయిరితేష్, ఎస్.ఎం. ముజామిల్, టి. తారక్ లు స్వర్ణ పతకం, కాడెట్స్ విభాగంలో సీహెచ్. మనోరంజిత్, ఏ. మహీధర, ఏ.ధనుష్ లు కాంస్య పతకం, సబ్ జూనియర్స్ విభాగంలో డి. యశ్వంత్, ఏ. నాగసాత్విక్ శర్మ, టి.కృష్ణమోహన్ లు కాంస్య పతకం, సబ్ జూనియర్ బాలికల విభాగంలో డి. శ్రీదిత్య, ఎన్. నిహార, ఏ. శ్రీతేజు లు కాంస్య పతకం, కటా లో ఎన్. నిహార కాంస్య పతకం, డి. శ్రీదిత్య రజత పతకం సాధించినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. అకాడమీ కోచెస్ అయినటువంటి డి. కళ్యాణ్ బాబు , ఎం.సూర్య వంశీ , ఎం.చైతన్య రెడ్డి , ఎం.అనిల్ కుమార్ గారిని ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# నంద్యాలకు తాగునీటి కొరత లేదు

## ..మున్సిపల్ ఎంఈ నాగభూషణ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
నంద్యాల పట్టణానికి తాగునీటి సరఫరాపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని, ప్రజలకు నిరంతరాయంగా మంచినీటిని అందించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణ రెడ్డి తెలిపారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వెలుగోడు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.808 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులో ఉందన్నారు. నంద్యాల పట్టణానికి ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు 0.73 టీఎంసీల నీరు సరిపోతుందని వివరించారు.ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుంటే పట్టణానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడే అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మంచినీటిని అందించేలా మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన నిర్వహణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. తాగునీటి విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, మున్సిపాలిటీపై పూర్తి విశ్వాసం ఉంచాలని మున్సిపల్ ఎంఈ నాగభూషణ రెడ్డి కోరారు.

# మూడు రెట్లు ధరకు స్టాంపులు




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంపు పత్రాల విక్రయంలో భారీ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాల్సిన నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలను కొందరు లైసెన్సు కలిగిన విక్రేతలే మూడు రెట్లు వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.రూ.100 విలువైన స్టాంపు పత్రాన్ని రూ.300కు, రూ.50 స్టాంపును రూ.200కు, రూ.20 స్టాంపును రూ.120కు విక్రయిస్తూ ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా రిజిస్ట్రేషన్‌లు, అఫిడవిట్లు, ఒప్పందాలు, ఇతర న్యాయపరమైన అవసరాల కోసం వచ్చే ప్రజల పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిసరాల్లోనే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. స్టాంపు పత్రాల కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం, స్టాంపులురిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలు వెలికితీసి అక్రమాలు రుజువైతే బాధ్యులైన లైసెన్సు విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ ధరలకే స్టాంపు పత్రాలు అందుబాటులో ఉండేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఎల్‌నినోపై రైతులకు కీలక సూచనలు చేసిన వ్యవసాయ అధికారులు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్ఏఆర్ఎస్) నంద్యాల శాస్త్రవేత్తలు సూచించారు. రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందించేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎల్‌నినో మానిటరింగ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జూలై నెలలో జిల్లాకు సాధారణంగా 116 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 6 మి.మీ. మాత్రమే కురిసిందని, దీంతో జిల్లాలోని 30 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న సాగును తగ్గించాలని, ఇప్పటికే విత్తిన పంటలకు లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బోరు నీటితో సాగు చేస్తున్న పంటలకు వరుస విడిచి వరుసకు నీటిపారుదల చేపట్టడం, తక్కువ కాలంలో వచ్చే మినుములు, కొర్రలు, సజ్జలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం, నేలలో తేమ నిల్వ ఉండేలా అంతర కృషి చేపట్టడం మంచిదన్నారు.జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు ఆర్. గంగాధర్‌రావు ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, వ్యవసాయ శాఖ చర్యలను వివరించారు. అనంతరం నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాదరావు పంటల బీమా, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు శాస్త్రీయ సూచనలు పాటిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

# పట్టణ శుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం

## ..మున్సిపల్ కమిషనర్ బి శేషన్న.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 14:**
పట్టణ శుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పేర్కొన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ పారిశు ద్ధ్య కార్మికులు అంకితభావంతో పని చేస్తున్నా రని తెలిపారు. ఇబ్బందులు ఎదురైనా, పరిక రాలు సక్రమంగా పని చేయకపోయినా.. అధి కారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలనీల్లో నిర్ణీత సమ యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలువల్లో వ్యర్థా లను తొలగించాలని పేర్కొన్నారు.
కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్. శభరిష్. శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

బుధవారం 15 జులై 2026

# ఉద్యాన రంగంపై చిన్నచూపా..?

**.. రైతు ఆదాయానికి వెన్నెముకగా నిలవాల్సిన శాఖే ఎందుకు బలహీనంగా ఉంది.?**

**..రాష్ట్ర అవసరాలకు కూడా సరిపోని పండ్లు,కూరగాయల ఉత్పత్తి... ఉద్యాన శాఖ బలోపేతమే శాశ్వత పరిష్కారం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 14:**
తెలంగాణలో సుమారు ఐదు కోట్ల జనాభా ఉంది. అయితే రాష్ట్రంలో పండుతున్న ఉద్యాన పంటలు, ముఖ్యంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి రాష్ట్ర అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. ఫలితంగా ప్రతి రోజు పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా కూరగాయలు, పండ్లు దిగుమతి అవుతున్నాయి. దీనివల్ల రాష్ట్ర సంపద ఇతర రాష్ట్రాలకు వెళ్లడమే కాకుండా, తెలంగాణ రైతులు పొందాల్సిన ఆదాయం కూడా బయటకు వెళుతోంది.
వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చగలిగే రంగాల్లో ఉద్యాన రంగం అత్యంత కీలకమైనది. తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయం, ఏడాది పొడవునా ఉపాధి, విలువ ఆధారిత పరిశ్రమలు, ఎగుమతుల అవకాశాలు, పోషకాహార భద్రత వంటి అనేక ప్రయోజనాలు ఈ రంగం సొంతం.అయినప్పటికీ తెలంగాణలో ఉద్యాన రంగం తన పూర్తి సామర్థ్యాన్ని ఇంకా అందుకోలేకపోతోంది.

### ఉద్యాన విశ్వవిద్యాలయం ఉంది... నిపుణులు ఉన్నారు... కానీ బలమైన వ్యవస్థ ఎక్కడ?

రాష్ట్ర విభజన అనంతరం ఏర్పాటైన కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ, డిప్లొమా కళాశాలల నుంచి ప్రతి సంవత్సరం వందలాది ఉద్యాన శాస్త్ర నిపుణులు బయటకు వస్తున్నారు. అయితే వీరిలో చాలామందికి ఉద్యాన శాఖలో ఉద్యోగ అవకాశాలు పరిమితంగానే ఉన్నాయి. ఒకవైపు చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతుండగా, మరోవైపు రైతులకు అవసరమైన సాంకేతిక సేవలు క్షేత్రస్థాయిలో అందడం లేదు. ఈ పరిస్థితి ఉద్యాన రంగ అభివృద్ధిని ప్రభావితం చేస్తోంది.

### జిల్లాలు పెరిగాయి... ఉద్యాన శాఖ మాత్రం అదే స్థాయిలో విస్తరించలేదు

రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగి పరిపాలన ప్రజలకు మరింత చేరువైంది. కానీ ఉద్యాన శాఖలో అదే స్థాయిలో పోస్టుల పెంపు జరగలేదు. అనేక జిల్లాల్లో సిబ్బంది కొరత కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన అధికారుల పోస్టులు ఖాళీగా ఉండగా, మరికొన్ని చోట్ల అవసరానికి తగిన సిబ్బంది అందుబాటులో లేరు.
దీంతో రైతులకు సమయానికి సాంకేతిక సలహాలు, పంటల ప్రణాళిక, తెగుళ్ల నివారణ, ప్రభుత్వ పథకాల అమలు వంటి సేవలు సమర్థవంతంగా అందడం కష్టమవుతోంది.

### అరకొర అధికారులతో ఉద్యానాభివృద్ధి సాధ్యమేనా?

ప్రస్తుతం తెలంగాణ ఉద్యాన శాఖలో సుమారు 153 మంది ఉద్యాన అధికారులు మాత్రమే ఉన్నారని, వారిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారి సంఖ్య ఇంకా తక్కువగా ఉందని అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. 563 మండలాలకు ఈ సంఖ్య సరిపోదు. ఫలితంగా ఒక్కో అధికారి అనేక మండలాల బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.
ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు నిరంతర సాంకేతిక సేవలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వ్యాధులు-తెగుళ్ల నియంత్రణ, మార్కెట్ సమాచారాన్ని అందించడం వంటి అంశాలు ప్రభావితమవుతాయి.

### రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన శాఖ బలోపేతం తప్పనిసరి

వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులు, వాతావరణ మార్పులు, ధరల అస్థిరత రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతు ఆదాయాన్ని పెంచగలిగే ప్రధాన రంగంగా ఉద్యాన రంగాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

### దీనికోసం కొన్ని కీలక చర్యలు అవసరం.

ఉద్యాన అధికారుల ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేసి ప్రతి మండలానికి కనీసం ఒక ఉద్యాన అధికారిని అందుబాటులో ఉంచాలి.
ఉద్యాన శాస్త్రం చదివిన యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ క్రాప్ ప్లానింగ్ అమలు చేయాలి.
పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాలకు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయాలి. ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేసి సేకరణ, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలి.
కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు, రైపెనింగ్ చాంబర్లు, రిఫ్రిజిరేటెడ్ రవాణా వంటి మౌలిక వసతులను విస్తరించాలి. ఉద్యాన ఉత్పత్తులకు రవాణా సబ్సిడీ, ఎగుమతి ప్రోత్సాహకాలు అందించాలి.
పండ్లు, కూరగాయలకు ధర భరోసా లేదా కనీస ధర రక్షణ వ్యవస్థను రూపొందించాలి.
ఉద్యాన పంటలకు ప్రత్యేక పంట బీమా అమలు చేయాలి.
గ్రామీణ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి.
ఉద్యాన రంగ స్టార్టప్‌లకు ప్రత్యేక విధానం, ఆర్థిక సహాయం అందించాలి.
సేంద్రియ ఉద్యాన సాగు, పట్టణ మిద్దె తోటల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.
ఉద్యాన రంగం బలపడితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకే బలం
ఉద్యాన రంగం కేవలం రైతుల ఆదాయాన్ని పెంచే రంగం మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఉపాధి, మహిళల స్వయం ఉపాధి, పోషకాహార భద్రత, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతుల అభివృద్ధికి కూడా కీలక ఆధారం. ఈ రంగంలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే సామర్థ్యం కలిగి ఉంది.
తెలంగాణలో వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చాలంటే ఉద్యాన రంగానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఉద్యాన శాఖను పునర్వ్యవస్థీకరించడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, శాస్త్రీయ సాంకేతిక సేవలను ప్రతి రైతుకు చేరవేయడం ద్వారా మాత్రమే ఈ రంగం ఆశించిన స్థాయికి చేరుకోగలదు.
రైతు ఆదాయం పెరగాలంటే ఉద్యాన రంగం బలపడాలి. ఉద్యాన రంగం బలపడాలంటే ఉద్యాన శాఖ బలోపేతం కావాలి. అదే తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి శాశ్వత మార్గం

# ఎండల తీవ్రతకు పెరిగిన విద్యుత్ డిమాండ్



**హైదరాబాద్,జూలై 14ఆంధ్ర ప్రగతి**
ఎండల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై రెండు వారాల్లో రోజువారీ విద్యుత్ వినియోగం 61-71 మిలియన్ల యూనిట్ల ఉండగా, ఈ ఏడాది జూలై 11 తేది నాటికి 71-82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవు తోంది. నగరంలో సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 36.7 డిగ్రీలు, కనిష్ఠం - 25.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భానుడి భగ.. భగలకు నగరవాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాలం లోనూ వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జూలై 13 వరకు హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా 175 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 100.1 మిల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 43 శాతం తక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 26 శాతం, మేడ్చల్- మల్కాజిగిరిలో 54 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 తక్కువ వర్షపాతం ఈ సీజన్‌లో నమోదైంది.మరో వారం రోజులు భారీ వర్ష సూచనలు కన్పించడం లేదని బేగంపేట సీనియర్ వాతావరణశాఖ అధికారి జీఎన్ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నగరంలో నమోదవుతున్నాయి. మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

# సరిహద్దుల్లో అమెరికాన్ మాజీ సోల్జర్ అరెస్ట్

**అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పట్టివేత -పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు**



**న్యూఢిల్లీ,జూలై 14 ఆంధ్ర ప్రగతి** భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపుర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్ట్ పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

# పల్నాడు జిల్లాలో విషాద ఘటన

**పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య**



**పల్నాడు,జూలై 14 ఆంధ్ర ప్రగతి**
పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహకు పాల్పడింది. తల్లి నక్క భారతి(28) తన ఇద్దరు కుమారులు హేమంత్ రెడ్డి(5), తేజ(3)ను హత్య చేసిన అనంతరం తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం పోలీసులు అన్ని ఆధారాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

**శంషాబాద్‌లో ప్రత్యే అంబులెన్స్‌ల ద్వారా తరలింపు**

**ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**అమరావతి,జూలై 14 ఆంధ్ర ప్రగతి** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన పక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించే పక్రియను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

**అమ్మవారి దర్శనానికి పెరిగిని భక్తుల రాక**




**విజయవాడజూలై 14 ఆంధ్ర ప్రగతి :** ఆషాడం మొదలు కానుండడంతో బెజవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య మంగళవారం కూడా మంచిదన్న భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలి రావడంతో భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికై తరలి వచ్చారు. అమ్మవారి ప్రసాదాలను కూడా భక్తులు పెద్ద ఎత్తుననే స్వీకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రత, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, ప్రసాద సేవ, అన్నదానం, తలనీలాల సమర్పణతో ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంతో కళకళలాడింది. భక్తులందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ ఆలయం నుంచి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు.
-------